

పంటల వివరాలు పకడ్బందీగా నమోదు చేయాలి

షాబాద్, జూన్ 21 : వానాకాలంలో రైతులు సాగు చేసిన వివిధ పంటలను సర్వే నెంబర్లవారిగా పకడ్బందీగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి సూచించారు. శుక్రవారం షాబాద్ క్లస్టర్‌లోని పలు గ్రామాల్లో పంట పొలాలను సందర్శించి, ఆన్‌లైన్ నమోదును పరిశీలించారు. జిల్లాలో రైతులకు సరిపడా ఎరువులు, విత్తనాలు ఉన్నాయన్నారు. రైతులు వ్యవసాయాధికారుల సూచనలు పాటిస్తూ పంటల సాగులో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆమె వెంట ఏవో వెంకటేశం, ఏఈవో రాజేశ్వరి రైతులు ఉన్నారు.

అవసరం లేనప్పుడు తన ప్రతాపాన్ని చూపిన వరుణుడు.. అవసరమైనప్పుడు మాత్రం ముఖం చాటేశాడు. పంటలు చేతికందే దశలో వరుస వర్షాలతో రైతులు ఆగమాగమయ్యారు. తీరా ఇప్పుడు వానాకాలం పంటలు సాగు చేసుకుందామనుకుంటే చినుకు లేక దిక్కులు చూస్తున్నారు. ఇటీవల కురిసిన అడపాదడపా వానలకు రైతులు దుక్కులు దున్నుకొని సాగుకు సిద్ధంగా ఉన్నారు. ఇప్పటికే కొందరు పత్తి, జొన్న విత్తనాలు వేశారు. గట్టి వాన పడితే విత్తనాలు వేద్దామనుకున్నారు మరికొందరు. అయితే, వానదేవుడు ముఖం చాటేయడంతో ఇప్పటికే అక్కడక్కడా మొలిచిన మొలకలు కూడా వాడిపోతున్నాయి.

- దుక్కులు దున్ని సిద్ధంగా ఉన్న రైతులు
- అక్కడక్కడా విత్తిన విత్తనాలు
- ఎండలకు వాడిపోతున్న వైనం
- జిల్లాలో అలముకున్న కరువు మేఘాలు
- ఆందోళనలో రైతులు



కందుకూరు మండలం కొత్తగూడలో ఎండిపోతున్న జొన్న పంట

జాడలేని తొలకరి!

సాధారణంగా తొలకరి వర్షాలు కురిస్తే జూన్ మొదటి వారం నుంచి రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో ఆరుతడి, మొట్ట పంటల సాగు ఆరంభమవుతుంది. కానీ రెండోవారం వరకూ వాన జాడ లేకపోగా, మరో వారం వరకు వర్షాలు కురిసే అవకాశం లేదని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. సాధారణంగా మే చివరి వారంలో కురిసిన వర్షాలకు దుక్కులు దున్ని విత్తనాలు వేస్తారు. కానీ.. జూన్‌లో కూడా వర్షాలు లేక పత్తితో పాటు పెసర, కంది, మొక్కజొన్న పంటల సాగు ఆలస్యం జరుగుతోంది.



చౌదరిగూడ మండలం గుర్రంపల్లి శివారులో మొలక దశలోనే ఎండిపోతున్న పత్తి



తొలకరి కలవరం

సీజన్ ప్రారంభమైనా జాడలేని వర్షాలు

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, జూన్ 21: మృగశిర కార్తెతో వర్షాకాలం ప్రారంభమై వాతావరణమంతా చల్లబడుతుందని ఆశించిన రైతులు వరుణుడి కోసం ఎదురు చూడక తప్పడం లేదు. జూన్ మొదటి వారంలోనే తొలకరి పలకరించినప్పటికీ నైరుతి రుతుపవనాలు అలస్యంతో రెండు వారాలనుంచి ఒక్క వర్షం కూడా పడక పోవడంతో ఖరీఫ్ సీజన్ వెనక్కి వెళ్తోంది. వానాకాలం సీజన్ ప్రారంభమై 20 రోజులవుతున్నా చినుకు కోసం రైతన్న ఆకాశం వైపు ఆశగా ఎదురు చూడాల్సి వస్తోంది. వర్షాకాలం ప్రారంభం నుంచి ఇప్పటి వరకు ఒక్క పెద్ద వర్షమూ రాకపోవడంతో రైతులు అందోళన చెందుతున్నారు. వారం రోజులుగా మేఘాలు ఊరిస్తూ చిరు జల్లులకే పరిమితమవుతోంది. పూర్తిస్థాయిలో విత్తనాలు విత్తుకునేందుకు సరిపడా వర్షం కురవడం లేదు. ఇప్పటికే రైతులు విత్తనాలు, ఎరువులు సిద్ధం చేసుకున్నారు. రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా 4,45,464 ఎకరాలు వివిధ రకాల పంటలు వేయనున్నట్లు వ్యవసాయ శాఖ అంచనా వేసింది. భూమిలో తడి లేకుండా విత్తులు విత్తుకోవద్దని వ్యవయసాయాధికారులు చెబుతున్నారు. అక్కడక్కడా కురిసిన వర్షాలకు 50 శాతం విత్తనాలు విత్తుకున్నట్లు వ్యవసాయశాఖ అంచనా వేస్తుంది. వికారాబాద్ జిల్లాలో వివిధ రకాల పంటలు కలిపి మొత్తం 5,97,830 ఎకరాల్లో సాగు చేస్తారని అధికారులు అంచనా వేశారు. గత ఏడాది వానాకాలంలో సాగు చేసిన పత్తి, కంది, మొక్కజొన్న పంటలు ఈసారి ఎక్కువ విస్తీర్ణంలో సాగయ్యే అవకాశం ఉంది. ఇప్పటి వరకు జిల్లాలో పది శాతం విత్తనాలు విత్తలేదు. మృగశిర కార్తె వచ్చి 15 రోజులు గడిచినా వర్షాలు కురియకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జూన్‌లో నమోదైన వర్షపాతం వివరాలు (మి.మీలలో)

జిల్లా	సాధారణం	కురిసింది	లోటు
రంగారెడ్డి	94.0	68.5	- 27.1
వికారాబాద్	91.1	105.4	+ 44.3

ముందు నాటిన విత్తనాలు మొలకెత్తేనా?

రైతులు జూన్ మొదటి వారం నుంచి పత్తి విత్తనాలు విత్తారు. సుమారు 20 రోజులు గడిచినా వర్షాలు లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అరకొర వర్షం కురిసినా అధిక ఉష్ణోగ్రతల కారణంగా అవి మొలకెత్తే అవకాశం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఏప్రిల్, మేలలో అకాల వర్షాలు కురియడంతో రైతులు ముందుగానే దుక్కులు సిద్ధం చేసుకున్నారు. విత్తులు నాటి తొలకరి వర్షం కురియగానే మొలకెత్తుతాయని ఆశించిన రైతుల ఆశలు అడియాశలయ్యాయి. భూమిలో వేసిన విత్తనాలు ఎండిపోవడంతో మళ్లీ విత్తనాలు విత్తుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. అధిక దిగుబడినిచ్చే పేరున్న కంపెనీల విత్తనాలు రైతులు అధిక ధర చెల్లించి కొనుగోలు చేశారు. విత్తులు దుక్కుల్లోనే ఎండి పోతుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. వికారాబాద్ జిల్లాలో ఈనెలలో అధిక వర్షంపాతం కురిసినా అది కొన్ని ప్రాంతాల్లోనే కురిసింది. మిగతా చోట్ల మొలకెత్తిన పంట మొక్కలు వాడిపోతున్నాయి.



పూడూరు మండలం రాకంచర్లలో మొలకెత్తని మొక్కజొన్న

దుక్కులు దున్ని ఎదుచూస్తున్నం



గత ఏడాది ఇప్పటికే విత్తనాలు విత్తాం. ఈసారి ఇప్పటి వరకు వర్షం కురియలేదు. దుక్కులు దున్ని వరుణదేవుడి కోసం ఎదురు చూస్తున్నం. చెలక పొలంలో అయితే ఇప్పటికే గడువు దాటింది. నల్లరేగడి నేలల్లో అయితే ఇంకా విత్తనాల విత్తేందుకు అవకాశం ఉంది. వాన కోసం దేవుడిని ప్రార్థిస్తున్నం.

-గోలినాయక్; రైతు, పరిగి

మళ్లీ దున్ని పంట వేయాల్సి వచ్చింది



తొలకరి వర్షాలకు మూడెకరాల్లో జొన్న, కంది విత్తనాలు వేశాను. మొలకలు ఎదుగుతున్న దశలోనే ఎండలు ముదిరాయి. వర్షాలు పడకపోవడంతో మొలకలు వాడుతున్నాయి. రూ.30 వేల వరకు పెట్టుబడి పెట్టి విత్తనాలు వేశాను. ఇప్పుడు అవి ఎండిపోయాయి. దీంతో మొత్తం దున్ని మళ్లీ పంట వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

బొక్క రాజేందర్‌రెడ్డి, కొత్తగూడ, కందుకూరు మండలం

2024 వానాకాలం సాగు ప్రణాళిక ప్రకారం (ఎకరాల్లో)

జిల్లా	రంగారెడ్డి	వికారాబాద్
పంటలు	సాగు అంచనా	
వరి	1,38,187	1,10,000
జొన్న	3,361	2,504
మొక్కజొన్న	66,530	50,450
పెసలు	48	13,000
కందులు	11,584	1.50,000
పత్తి	1,76,174	2,63,500
మినుములు	34	5000
వేరుశనగ	550	500
ఆముదం	37	20
ఇతర పంటలు	48,959	2,880

వేసిన విత్తనాలు భూమిలోనే మాడిపోయాయి



ఈసారి 25 ఎకరాలు కౌలుకు తీసుకుని పత్తి సాగు చేశాను. అధికధర, నాణ్యమైన విత్తనాలైన రేవంత్ రకం పత్తి విత్తనాలు వేశాను. ఎకరానికి రూ.12 వేలకు పైనే ఖర్చు చేశాను. వర్షాలు లేకపోవడంతో వేసిన విత్తనాలు భూమిలోనే మాడిపోయాయి. మళ్లీ విత్తులు వేసుకునేందుకు డబ్బులు లేవు. పంట పెట్టుబడి కోసం మరోసారి అప్పు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం స్పందించి రైతులకు 90శాతం సబ్సిడీపై విత్తనాలు, ఎరువులను అందించాలి.

- గంగాపురం లక్ష్మారెడ్డి, లాలాపేట్, కొందుర్గు మండలం

భూమి 15-20 సెంటిమీటర్ల లోతు తడిసినప్పుడే విత్తుకోవాలి



భూమి 15-20 సెంటిమీటర్ల లోతు వరకు తడిసినప్పుడే విత్తనాలు వేసుకోవాలి. తేలిక పాటి నేలలకు 50-60 సెంటీమీటర్లు, బరువు నేలల్లో 60-75 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైతే విత్తులు విత్తుకోవాలి. జూన్ 20 వరకు విత్తనాలు వేసుకోవచ్చు. వరి పంట దీర్ఘకాలిక, మధ్యకాలిక రకాలు ఆగస్టు వరకు నాటుకోవచ్చు. వర్షాధార పంటలైన కంది, పెసర, జొన్న, మొక్కజొన్న పంటలు నాగలి సాలు వచ్చేంత తడి ఉండాలి. అప్పుడు విత్తుకుంటే మంచిది.

-గీతారెడ్డి, రంగారెడ్డి జిల్లా వ్యవసాయాధికారి

యోగాతో మానసిక ప్రశాంతత

- మోదీతోనే యోగాకు ప్రపంచ గుర్తింపు
- కన్హా శాంతివనం ఆధ్యాత్మికతకు కేంద్రం
- గవర్నర్ రాధాకృష్ణన్
- కన్హా శాంతివనంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం.. పాల్గొన్న గవర్నర్



కన్హా శాంతివనంలో మొక్క నాటి నీరు పడుతున్న గవర్నర్



కన్హా శాంతివనంలో యోగా చేస్తున్న గవర్నర్ రాధాకృష్ణన్

నందిగామ, జూన్ 21 : యోగాతో మానసిక ప్రశాంతతతో పాటు శారీరక ధృఢత్వం పెంపొందుతుందని, యోగాకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చిన వ్యక్తి ప్రధాని నంద్ర మోదీ అని తెలంగాణ గవర్నర్ రాధాకృష్ణన్ అన్నారు. శుక్రవారం నందిగామ మండల పరిధిలోని కన్హా శాంతివనంలో అభ్యాసిలతో కలసి గవర్నర్ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి 5 వేల మంది పాల్గొన్నారు. అభ్యాసీలతో కలసి యోగాతో పాటు ధ్యానం చేశారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ కన్హా శాంతివనం ఆధ్యాత్మికతకు కేంద్రమని, రామచంద్రమిషన్ సేవలు ప్రశంసనీయమని అన్నారు. ప్రధాని నరేంద్రమోదీతోనే యోగాకు ప్రపంచ గుర్తింపు వచ్చిందని, ఆశ్రమంలో ధ్యానం చేస్తే ఎంతో ప్రశాంతంగా ఉందన్నారు. కన్హా శాంతివనం చాలా స్ఫూర్తిదాయకమైందని, ఆధ్యాత్మికతకు కేంద్రమని, మానవ జీవిత వికాసానికి ముఖ్యమైందని అన్నారు. హార్ట్‌ఫులెనెస్ సెంటర్‌ను సందర్శించినప్పుడు దాజీ మార్గదర్శకత్వంలో ప్రకృతిని తాకినట్లు అనుభూతి చెందానని, ప్రకృతి అందాలను రక్షించడం అందరి బాధ్యత అని ఆయన అన్నారు. ప్రతీ ఒక్కరు ఇక్కడకు వచ్చి అమలు చేయబడుతున్న గొప్ప కార్యక్రమాలను వీక్షించి వీలైనంతగా ముందుకు తీసుకెళ్లాలన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ కన్హా శాంతివనంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో రామచంద్రమిషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నిధుల కొరతా.. అలసత్వమా?

- ముందుకు సాగని రోడ్డు విస్తరణ పనులు
- బీటీ రోడ్డును తవ్వి మట్టిపోసి వదిలేసిన వైనం
- రోడ్లు భవనాల శాఖలో నిధుల కొరతే కారణం!
- ఎనిమిది నెలలుగా ఎక్కడి పనులు అక్కడే..
- దుమ్ము, ధూళితో ప్రజలు, వాహనదారుల ఇక్కట్లు



మట్టిపోసి వదిలేసిన యాచారం-మీర్‌ఖాన్‌పేట రోడ్డు

యాచారం, జూన్ 21 : గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు ఎనిమిది నెలలుగా ముందుకు సాగడం లేదు. యాచారం మండల కేంద్రం నుంచి కందుకూరు మండలంలోని మీర్‌ఖాన్‌పేట వరకు రోడ్డు విస్తరణ కొరకు బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.78కోట్లు కేటాయించింది. యాచారం మండలంలోని నందివనపర్తి నుంచి మేడిపల్లి ఫార్మాసిటీ వరకు మరో రూ.48కోట్లు కేటాయించింది. కాగా, ఈ రహదారులపై మూడు చోట్ల భారీ బ్రిడ్జీలు కూడా నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించారు. నందివనపర్తి, మేడిపల్లి గ్రామాల మధ్య రెండు చోట్ల నిర్మించిన బ్రిడ్జీలు అసంపూర్తిగా ఉన్నాయి. ఈ రెండు గ్రామాల మధ్య ప్రయాణమంటేనే వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. నందివనపర్తి నుంచి మేడిపల్లి వెళ్లే దారిలో బ్రిడ్జి వద్ద ఇటీవల బైక్ బోల్తాపడిన ఘటనలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి చేయకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని వాహనదారులు, స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆర్అండ్‌బీ అధికారులకు విషయం తెలిసినా రోడ్డు వెడల్పు పనులు. బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయలేకపోతున్నారనే ఆరోపణలున్నాయి. యాచారం మండల కేంద్రం నుంచి మీర్‌ఖాన్‌పేట వరకు రోడ్డు విస్తరణ పనులు మొదలు పెట్టి 8 నెలలు గడుస్తున్నా ముందుకుసాగడం లేదు. గతంలో ఉన్న బీటీ రోడ్డును పూర్తిగా తవ్వేసి మట్టిపోసి చేతులు దులుపుకున్నారు. రోడ్డు పనులకు అవసరమైన కంకర తదితర మెటీరియల్ తయారీకి నజ్దిక్‌సింగారం సమీపంలో తాత్కాలిక రెడీమిక్స్ ప్లాంట్‌ను కూడా ఏర్పాటు చేశారు. అయితే, ఇప్పటివరకు రోడ్డు విస్తరణ పనులకు సంబంధించి బిల్లులు ఇవ్వకపోవడంతో కాంట్రాక్టర్ పనులు చేయడం లేదని సమాచారం. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో పాటు ఇన్నాళ్లు విధుల్లో ఉన్న ఆర్అండ్‌బీ డీఈ, ఏఈ, జేఈలు ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లారు. కొత్తగా వచ్చిన అధికారులు రోడ్ల విస్తరణ పనులపై దృష్టి సారించలేకపోతున్నారు. బీటీ రోడ్డును తవ్వి మట్టిపోయడంతో వాహనాల రాకపోకల కారణంగా దుమ్ము, ధూళికి ప్రజలు, వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. నజ్దిక్‌సింగారం సమీపంలో రోడ్డుకు ఆనుకొని బ్రాయిలర్ కోళ్ల షెడ్లు ఉన్నాయి. దుమ్ము చెలరేగడంతో కోళ్లు, దాణాపై పడుతోందని, నిత్యం కోళ్లు చనిపోతున్నాయని రైతులు వాపోయారు. రెండు నెలలుగా 400 కోళ్లు చనిపోయినట్లు రైతులు తెలిపారు. పాడి పశువుల మేతపై దుమ్ము, ధూళి చేరడంతో జీవాలు రోగాల బారిన పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పక్కనే ఉన్న హరితహారం నర్సరీపై దుమ్ము పడుతుండటంతో మొక్కలు వాడిపోతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అదేవిధంగా మామిడితోటకు తీవ్ర నష్టం జరిగిందని లక్ష్మారెడ్డి, వెంకటరెడ్డి అనే మామిడి రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రహదారి విస్తరణ పనులకు బిల్లులు అందకపోవడంతో పనులు నిలిపివేసినట్లు ఆర్అండ్‌బీ ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చినా పట్టించుకోవడం లేదని సమాచారం. ఉన్నతాధికారులు రోడ్డు విస్తరణ పనులు పూర్తిచేయాలని ప్రయాణికులు, వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.



రహదారి విస్తరణ పనుల కోసం ఏర్పాటు చేసిన రెడీమిక్స్ ప్లాంట్

దుమ్ము, ధూళితో కోళ్లు మృత్యువాత



రోడ్డు బస్సులు, ఇతర వాహనాలు వెళుతుండటంతో నిత్యం దుమ్ము, ధూళి లేచి కోళ్లు, దాణాపై పడుతోంది. దాంతో కోళ్లు చనిపోతుండడంతో తీవ్ర నష్టం వాటిల్లుతోంది. ప్రభుత్వం త్వరగా రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేసి ఇబ్బందుల తొలగించాలి.

- శ్రీశైలం, బ్రాయిలర్ కోళ్ల పెంపకందారుడు

రోగాల బారిన పాడి పశువులు



దుమ్ము, ధూళి కారణంగా పాడిపశువులు రోగాల బారిన పడుతున్నాయి. నెల క్రితం రూ.35వేలు ఖర్చు చేసి వరిగడ్డి కొనుగోలు చేశా. వాహనాల రాకపోకలతో దుమ్ము లేచి పశుగ్రాసంపై పడుతోంది. పశువులకు వేస్తే మేయడం లేదు. రోడ్డు విస్తరణ పనులు వెంటనే చేపట్టాలి.

- రాములు, రైతు, నజ్దిక్‌సింగారం

చేవెళ్ల ఎస్ఐ వీరబ్రహ్మం బదిలీ

- ఆయన స్థానంలో శ్రీకాంత్‌రెడ్డి రాక

చేవెళ్ల, జూన్ 21 : చేవెళ్ల ఎస్ఐ వీరబ్రహ్మంను బదిలీ చేస్తున్నట్టు పోలీస్ ఉన్నతాధికారులు శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. చేవెళ్ల పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఆయనను గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో నూతన ఎస్ఐగా మేడ్చల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి రానున్నారు. వీరబ్రహ్మం చేవెళ్ల ఎస్ఐగా దాదాపు పది నెలల పాటు విధులు నిర్వర్తించి ప్రజల మన్ననలు పొందారు.



వీరబ్రహ్మం

ఆమనగల్లు ఎస్ఐగా శ్రీనివాసులు

ఆమనగల్లు: ఆమనగల్లు ఎస్ఐగా పి.శ్రీనివాసులు నియమితులయ్యారు. శుక్రవారం ఈ మేరకు సైబరాబాద్ సీఐ అవినాశ్ మహంతి నుండి నియామక ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇక్కడ పనిచేస్తున్న బాల్‌రామ్ నాయక్‌ను కేపీహెచ్‌బీ పోలీసు స్టేషన్‌ను బదిలీ చేశారు. అక్కడ పనిచేస్తున్న పి.శ్రీనివాసులుకు ఆమనగల్లు లో పోస్టింగ్ ఇచ్చారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

ధారూరు, జూన్ 21: వానాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్తు కార్యనిర్వహణ అధికారి(సీఈవో) యం. సుధీర్ తెలిపారు. మండల పరిషత్తు కార్యాయలంలో శుక్రవారం నిర్వహించిన పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. పంచాయతీ ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు సీజనల్ వ్యాధుల పై సమన్వయంతో పనిచేయాలని ప్రజలకు వ్యాధులు ప్రబలకుండ చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. పంచాయతీల్లో రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో నర్సింహులు, ఈజీఎస్ ఎపీవో సురేష్, ఐకేపీ ఇన్‌చార్జి ఎపీఎం పండరి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంను కలిసిన ఎమ్మెల్యే



తాండూరు సమస్యలపై డిప్యూటీ సీఎంకు విన్నవిస్తున్న ఎమ్మెల్యే

తాండూరు, జూన్ 21: తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి హైదరాబాద్‌లోని ఉప ముఖ్యమంత్రి నివాసంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తాండూరు అసెంబ్లీ నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యలపై విన్నవించారు. తాండూరు ప్రాంతం పూర్తిగా వెనుకబడిందని ఈప్రాంతంలో సాగు, తాగునీటికి సంబంధించి చాలా సమస్యలు ఉన్నాయని వాటికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే డిప్యూటీ సీఎంను కోరారు. పలు సమస్యలపై డిప్యూటీ సీఎంకు వినతిపత్రాన్ని అందజేసినట్లు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తెలిపారు. ఆయన వెంట దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూధన్‌రెడ్డి, నాయకులు హర్షవర్ధన్‌రెడ్డి ఉన్నారు.

బషీరాబాద్ జూనియర్ కళాశాలకు పోస్టులు మంజూరు చేయాలి

మండల కేంద్రం బషీరాబాద్‌లో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలకు నూతన భవనం, కళాశాల టిచింగ్, నాన్ టిచింగ్ పోస్టులను మంజూరు చేయాలని ఉన్నత విద్యామండలి ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశంను తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని కార్యాలయంలో ముఖ్య కార్యదర్శిని కలిసి బషీరాబాద్ జూనియర్ కళాశాల పూర్తి స్థాయి అభివృద్ధిపై చర్చించారు.

బాధిత కుటుంబానికి 2.50 లక్షల ఎల్‌వోసీ అందజేత

బషీరాబాద్: కంసాన్‌పల్లి(ఎం) గ్రామానికి చెందిన ఈడిగి రాములు గౌడ్ హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. బాధితుడికి మెరుగైన చికిత్స కోసం ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి రూ.2.50 లక్షల విలువైన ఎల్‌వోసీని అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ సర్పంచ్ అనురాధవెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

27మంది ఎస్ఐల బదిలీ

మేడ్చల్, జూన్ 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని పోలీస్‌స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న 27మంది ఎస్ఐలను బదిలీ చేస్తూ సీపీ అవినాష్ మహంతి శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. మేడ్చల్ ట్రాఫిక్ ఎస్ఐ ఆర్.శ్రీకాంత్‌రెడ్డి, చేవెళ్ల, శామీర్‌పేటకు చెందిన వి.చంద్రశేఖర్ సైబర్ క్రైమ్‌కు బదిలీ అయ్యారు. ఆర్‌జీఐ ఏయిర్‌పోర్టు జి.మనియామ్ కేపీహెచ్‌బీ, కేపీహెచ్‌బీ పీఎస్‌కు చెందిన కె.సత్యనారాయణ షైలార్ దేవ్‌పల్లికి, అత్తాపూర్ పీఎస్‌కు చెందిన కె.నాగరాజు, రాయ్‌దుర్గం ట్రాఫిక్ ,బాలానగర్ పీఎస్‌కు చెందిన అశోక్ లిగిపల్లి అత్తాపూర్‌కు, రాజేంద్రనగర్ పీఎస్‌కు చెందిన పి.రవికిరణ్ ఎస్ఓటీ బాలానగర్ జోన్‌కు, స్పెషల్ బ్రాంచుకు చెందిన షేక్ ముమ్తాజ్ అహెమద్ సీసీఆర్‌బీకి బదిలీ అయ్యారు. సీపీవో సైబరాబాద్, ఆర్‌జీఐఏ ట్రాఫిక్‌లో విధులు నిర్వహిస్తున్న టి.వెంకటేశ్వరావును మాదాపూర్ ట్రాఫిక్, ఆర్‌జీఐఏ పీస్‌కు చెందిన ఆర్.పరుశురాం మేడ్చల్ ట్రాఫిక్ పీఎస్‌కు, సనత్‌నగర్ పీఎస్‌కు చెందిన జె.సుశీలను షాద్‌నగర్‌కు బదిలీ అయ్యారు. అదేవిధంగా సీసీఆర్‌బీలో విధులు నిర్వహిస్తున్న ఆర్.మౌనిక పేట్‌బషీరాబాద్ పీఎస్‌కు, కేపీహెచ్‌బీ ట్రాఫిక్‌కు చెందిన జి.శశిధర్ ఐటీ సెల్ సీపీఏ సైబరాబాద్‌కు, ఐటీ సెట్ సైబరాబాద్‌లో విధులు నిర్వహిస్తున్న సయ్యద్ నజీర్ మియాన్, ఐటీసెల్ సైబరాబాద్‌లో విధులు నిర్వహిస్తున్న ఈ.రూప కేపీహెచ్‌బీకి బదిలీ అయ్యారు. గచ్చిబౌలి ట్రాఫిక్‌లో విధులు నిర్వహిస్తున్న ఎ.కృష్ణను షైలార్‌దేవ్‌పల్లి, చేవెళ్ల నుంచి ఆర్.వీరబ్రహ్మంను గచ్చిబౌలి ట్రాఫిక్, షైలార్‌దేవ్‌పల్లి నుంచి నతీమ్ హుస్సేన్‌ను కేపీహెచ్‌బీ ట్రాఫిక్, సీసీఆర్‌బీకి చెందిన కె.రాజేశ్వర్ రెడ్డి మియాపూర్, మేడ్చల్ పీఎస్‌కు చెందిన నర్సింహగౌడ్ సీసీఎస్ మాదాపూర్, సీసీఎస్ మేడ్చల్‌కు చెందిన జి.పోచయ్య మేడ్చల్ పీఎస్‌కు, మియాపూర్ పీఎస్‌కు చెందిన ఎం.రాజు సీసీఎస్ బాలానగర్ జోన్, పేట్‌బషీరాబాద్‌కు చెందిన జి.సరిత కేపీహెచ్‌బీ ట్రాఫిక్, సీసీఎస్ బాలానగర్‌కు చెందిన దాసరి బాల్‌రాజ్ ఎస్ఓటీ మాదాపూర్ జోన్, ఎస్ఓటీ మాదాపూర్ జోన్ నుంచి బి.నర్సింహారెడ్డి మియాపూర్‌కు, ఎస్ఓటీ బాలానగర్ జోన్ నుంచి మామిడి కిషోర్ రాజేంద్రనగర్‌కు, రాయ్‌దుర్గం ట్రాఫిక్‌లో విధులు నిర్వహిస్తున్న మలావత్ పరుషరామ్ శామీఆర్‌పేట్ పీఎస్‌కు బదిలీ చేస్తూ సైబరాబాద్ సీపీ ఆదేశాలు జారీ చేశారు.

ఆయిల్‌పామ్ సాగుకు రాయితీలు

- ఆయిల్ ఉత్పత్తులను పెంచేందుకు ప్రత్యేక దృష్టి
- ఉద్యావన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ లహరి, సత్తార్

తాండూరు, మే 21 : ఆయిల్ ఫామ్ సాగు ద్వారా నూనె ఉత్పత్తులు పెంచుకోవాలని భారీ సబ్సిడీతో ప్రభుత్వం, కంపెనీలు ముందుకు వస్తున్నాయని ఉద్యావన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ లహరి అన్నారు. శుక్రవారం తాండూరు బాలాజీ మందిర్ హాల్‌లో ఉద్యాన ఇకోఫామ్ ఆయిల్ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో అయిల్‌ఫామ్ సాగుపై జిల్లా స్థాయి సదస్సు జరిగింది. ఈ ఈ సందర్బంగా విదేశాల నుంచి 73 లక్షల టన్నుల వంట నూనెను దిగుమతి చేసుకుంటున్నామని, మనమే విదేశాలకు ఎగుమతి చేసే స్థాయికి ఎదగాలన్నారు. ప్రభుత్వం, కంపెనీ , రైతుల భాగస్వామ్య ఒప్పందంతో ఈపంట సాగును పెంచనున్నట్లు, పంటసాగుకు ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా, చిన్నసన్న కారు రైతులకు 80శాతం, బడా రైతులకు 70శాతం సబ్సిడీ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఇండోనేషియా శాస్త్రవేత్త విజయాన్ మాట్లాడుతూ ఆయిల్ ఫామ్ సాగుకు అవసరమైన క్షేత్ర సిబ్బంది ద్వారా సాంకేతిక సలహాలు ఇవ్వడం జరుగుతుందని చీడ, పీడల బెడద ఉండదన్నారు. జిల్లా ఉద్యావన శాఖ అధికారి సత్తార్ మాట్లాడుతూ అయిల్ ఫామ్ పంట సాగు కోసం రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయిల్ సాగుతో పాటు పత్తి, పెసర, మక్క, సోయా కూరగాయాలు , కందులు, మినుములు, జొన్న తదితర పంటలను అంతర పంటలుగా వేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఇకోఫామ్ ఆయిల్ , యాడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కన్సల్టెంట్ డిఎన్.రామ్, తాండూరు ఉద్యాన శాఖ అధికారి మల్లికార్జున్, మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, డీసీసీబీ డైరెక్టర్ రవిగౌడ్, శాస్త్రవేత్త రంగరాజు, వ్యవసాయశాఖ జేడి గోపాల్ పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారి సత్తార్

తాండూరు రెవెన్యూ డివిజన్‌కు ప్రత్యేక హోదా

- సబ్ కలెక్టర్ హోదాలో ఐఎఎస్ అధికారి నియామకం
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- తాండూరు, కొడంగల్ పై ప్రత్యేక శ్రద్ధ



తాండూరు,మే 21 : తాండూరు రెవెన్యూ డివిజనల్ కార్యాలయానికి ప్రత్యేక హోదా కల్పించారు. రాష్ట్ర వ్యాప్తంగా 15రెవెన్యూ డివిజన్లకు సబ్‌కలెక్టర్ హోదాలో ఐఎఎస్ అధికారులను నియమించేలా పరిపాలన పరమైన వెసులుబాటును కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 15 రెవెన్యూ డివిజన్‌లలో వికారాబాద్ జిల్లాలోని తాండూరు రెవెన్యూ డివిజన్ కూడా ఉంది. దీంతో తాండూరు ఆర్డీవో కార్యాలయానికి సబ్ కలెక్టర్ హోదాలో ఐఎఎస్ అధికారిని నియమించనున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహించే కొడంగల్ నియోజకవర్గం కూడా తాండూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోకి వస్తుంది. త్వరలో ఐఎఎస్ అధికారిని ఈ రెవెన్యూ డివిజన్‌కు నియమించనున్నారు. ప్రస్తుతం ఆర్డీవో శ్రీనివాస్‌రావు కొనసాగుతున్నారు. హోదా పెంచడంతో ప్రస్తుత ఆర్డీవో శ్రీనివాస్‌రావు బదిలీ అయ్యే అవకాశాలున్నాయి. ఈయన స్థానంలో ఐఎస్ అధికారిని నియమించనున్నారు. పరిపాలన పరంగా విస్తృత అధికారాలు, నిర్ణయాలు తీసుకునేందుకు నియమించే అధికాకారికి ప్రత్యేక అధికారాలుంటాయి. తాండూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో తాండూరు పట్టణం, తాండూరు, యాలాల, బషీరాబాద్, పెద్దేముల్, కొడంగల్ పట్టణం, కొడంగల్ , మద్దూర్, బొంరాస్‌పేట్, దౌల్తాబాద్ మండలాలున్నాయి. ప్రత్యేక హోదాతో మరిన్ని మండలాలు అధికారి పరిధిలోకి తెచ్చే అవకాశాలున్నాయి.

ట్రైనీ కలెక్టర్‌ను నియమించే ఛాన్స్

తాండూరు రెవెన్యూ డివిజన్‌కు ఐఎఎస్ హోదా కల్పించారు. ఈనేపథ్యంలో వికారాబాద్ జిల్లాలో ప్రస్తుతం శిక్షణ పొందుతున్న ట్రైనీకలెక్టర్ ఉమాహారతిని నియమించే అవకాశాలున్నాయని అధికారులు పేర్కొంటున్నారు. వచ్చే వారం ఈ కార్యాలయానికి హోదా మార్పు చేసే అవకాశాలున్నాయి.

రెండు సెగ్మెంట్లపై ప్రత్యేక దృష్టి

తాండూరు, కొడంగల్ నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టిని ప్రభుత్వం కేంద్రీకరించిన్నట్లు కనబడుతోంది. ప్రత్యేకంగా ఐఎఎస్ హోదాను కల్పిస్తూ నిర్ణయం తీసుకోవడంతో భూ సమస్యలు, అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించేందుకోసమేనని తెలుస్తుంది.

దామర్‌చెడ్‌లో హ్యాండ్ బోర్ల మరమ్మతు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బషీరాబాద్, జూన్ 21: 'దామర్‌చెడ్‌లో తాగునీటి కష్టాలు' అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి బషీరాబాద్ ఎంపీడీవో రాఘవులు స్పందించారు. ఈమేరకు గ్రామ కార్యదర్శి నాగప్రసాద్‌తో ఆయన మట్లాడి వెంటనే మెకానిక్‌ను గ్రామానికి పంపించారు. కార్యదర్శి దగ్గరుండి రెండు చేతిపంపులను మరమ్మతు చేయించారు. ఎట్టకేలకు అధికారులు స్పందించి చేతి పంపులు మరమ్మతు చేయించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. మధ్యాహ్నం గ్రామానికి ఎంపీడీవో రాఘవులు, ప్రత్యేకాధికారి రమేష్ చేరుకుని బోరు మరమ్మతు పనులను పరిశీలించారు. అనంతరం స్థానికులతో మట్లాడుతూ.. ఒకటి, రెండు రోజుల్లో గోరిగడ్డ వద్ద డైరెక్టు పంపింగ్ సిస్టం బోరుకు కొత్త మోటారుకు ఏర్పాటు చేయించి బీసీకాలనీకి నీటిసమస్యకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.



హ్యాండ్‌బోరును మరమ్మత్తు చేయిస్తున్న నాగప్రసాద్

బోనఫైడ్ పంచాయితీపై విచారణ

- వివరాలు వెల్లడించిన కాంప్లెక్స్ హెచ్ఎం వైద్యనాథ్

తాండూరు రూరల్, జూన్ 21: మండలంలోని ఉద్దండాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థి శరత్ బోనఫైడ్ విషయంపై పూర్తి విచారణ జరిపినట్లు కాంప్లెక్స్ హెచ్ఎం వైద్యనాథ్ అన్నారు. ఎంఈవో వెంకటయ్య ఆదేశాల మేరకు శుక్రవారం పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కాంప్లెక్స్ హెచ్ఎం వైద్యనాథ్ మాట్లాడుతూ.. ఉద్దండాపూర్ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థి బీజే శరత్ బోనఫైడ్ సర్టిఫికెట్‌ను తండ్రి బీజే రాములు వారం రోజుల కిందట పాఠశాల నుంచి తీసుకెళ్లారు. పాఠశాలలోకి హెచ్ఎం రవీందర్‌కుమార్ శర్మ రానివ్వలేదు. దీంతో విద్యార్థి తండ్రి హెచ్ఎం మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ విషయమై విద్యార్థి తండ్రి రాములు ఎంఈవోకు ఫిర్యాదు చేయగా ఆయన ఆదేశాలతో శుక్రవారం పాఠశాలను సందర్శించారు. విద్యార్థి శరత్‌ను శనివారం నుంచి పాఠశాలలోకి అనుమతిస్తామని తెలిపారు. దీంతో ఈ బోనఫైడ్ పంచాయితీ ముగిసిందని తెలిపారు.



పాఠశాలలో విచారణ జరుపుతున్న కాంప్లెక్స్ హెచ్ఎం వైద్యనాథ్

యాచారంలో మోస్తరు వర్షం

యాచారం, జూన్ 21 : యాచారం మండల కేంద్రంతో పాటు చౌదర్‌పల్లి, గున్‌గల్, మేడిపల్లి, కుర్మిద్ద, తాటిపర్తి నందివనపర్తి, చిన్నతూండ్ల తదితర గ్రామాలలో శుక్రవారం రాత్రి ఉరుములు మెరుపులతో కూడిన మోస్తరు వర్షం కురిసింది, ఈ వర్షం కారణంగా తడారిన పత్తి పంటలకు ప్రాణం పోసినట్లయింది. సుమారు గంట పాటు వర్షం కురిసింది.





ప్రభుత్వ భూములను పరిశీలిస్తున్న ఆర్డీవో సూరజ్‌కుమార్

స్కిల్ డెవలప్‌మెంట్ వర్సిటీ ఏర్పాటుకు స్థల పరిశీలన

కడ్తాల్, జూన్ 21: కల్వకుర్తి నియోజకవర్గంలో అంతర్జాతీయ ప్రమాణాలతో వృత్తి నైపుణ్య విశ్వవిద్యాలయం(స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ) ఏర్పాటుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోంది. రాష్ట్ర రాజధానికి చేరువలో ఉన్న కల్వకుర్తి ప్రాంతంలో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ ఏర్పాటుకు సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నట్లు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే, ఉన్నతాధికారుల ఆదేశం మేరకు కడ్తాల మండలంలో శుక్రవారం కందుకూరు ఆర్డీవో సూరజ్‌కుమార్ పర్యటించారు. కడ్తాల తహసీల్దార్ ముంతాజ్, ఎంపీటీసీ గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శంకర్, సర్వే అధికారులతో కలిసి అన్మాస్‌పల్లి సమీపంలోని సర్వేనెంబర్ 260/29, 321లలో ప్రభుత్వ భూములను పరిశీలించారు. ఎక్కడెక్కడ ప్రభుత్వ భూములు ఉన్నాయి? ఎవరైన రైతులు ప్రభుత్వ భూములు ఆక్రమించారా? అనే కోణంలో పరిశీలన చేశారు. సర్వే నెంబర్ 260/29లో సుమారు 80 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందని గుర్తించినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. భూములకు సంబంధించి నివేదిక రూపొందించి ప్రభుత్వానికి నివేదిస్తామని పేర్కొన్నారు. డీఐలు కృష్ణయ్య, శ్రీనివాస్, సర్వేయర్ పాండురంగారెడ్డి, తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి

కడ్తాల మండలంలో ధరణి పోర్టల్‌కు సంబంధించి భూ సమస్యలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సత్వరమే వాటిని పరిష్కరించి ఇబ్బందులు తీర్చాలని ఎంపీటీసీ గూడూరు శ్రీనివాస్‌రెడ్డి ఆర్డీవో సూరజ్‌కుమార్‌ను కోరారు. అనేక మంది రైతుల పట్టా భూములు కూడా నిషేధిత జాబితాలో ఉండటంతో విక్రయించకుండా ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు. కడ్తాల మండలంలో రెగ్యులర్ సర్వేయర్ లేక ఇబ్బందులు తలెత్తుతున్నాయని వెంటనే సర్వేయర్‌ను నియమించాలన్నారు. స్పందించిన ఆర్డీవో సూరజ్‌కుమార్ పది రోజుల్లో సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కాంగ్రెస్ జిల్లా నాయకుడు గూడూరు భాస్కర్‌రెడ్డి, నాయకులు జహంగీర్‌అలీ, బాల్‌రాజ్, రవి, రాజేశ్, తదితరులు ఉన్నారు.

విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

యాచారం, జూన్ 21 : విద్యార్థులు డ్రగ్స్, గంజాయికి దూరంగా ఉండాలని, అవి మనిషి జీవితాన్ని పాడు చేస్తాయని హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ ఎస్సై ప్రసాద్ అన్నారు. శుక్రవారం మేడిపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులకు డ్రగ్స్, గంజాయి తీసుకుంటే కలిగే పరిణామాలపై అవగాహన కల్పించారు. మత్తుపదార్థాల క్రయ విక్రయాలపై సమాచారమందించాలని కోరారు. పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై ప్రసాద్



డీఆర్ఎంకు వినతి పత్రాన్ని అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

తిమ్మాపూర్ రైల్వేస్టేషన్‌ను పరిశీలించిన డీఆర్ఎం

కొత్తూర్, జూన్ 21: మున్సిపాలిటీలోని తిమ్మాపూర్ రైల్వేస్టేషన్‌ను హైదరాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ లోకేష్ వైష్ణోయ్ శుక్రవారం పరిశీలించారు. తిమ్మాపూర్ రైల్వేస్టేషన్ నుంచి సమీపంలో ఉన్న సీఎంటీఎల్ గోదాం వరకు నిర్మించే నూతన రైల్వే లైన్‌ను పరిశీలించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రయాణికులకు అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక రైల్వే అధికారులకు సూచన చేశారు. ఇదిలా ఉండగా, స్థానిక కాంగ్రెస్ నాయకులు డీఆర్ఎంను కలిసి షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పంపిన వినతిపత్రాన్ని అందజేశారు. కొత్తూర్ రైల్వేస్టేషన్ సమీపంలోని రైల్వేగేట్ వద్ద ఆర్‌వోబీ లేదా అండర్‌పాస్ నిర్మాణం చేపట్టాలని లేఖలో పేర్కొన్నారు. కొత్తూర్ పాత రైల్వేగేట్ వద్ద మురుగునీరు నిలిచిపోతోందని, ప్రజలు ఇబ్బందులకు గురైతున్నారని, మరమ్మతులు చేపట్టాలని పేర్కొన్నారు. డీఆర్ఎం స్పందిస్తూ అధికారులను పరిశీలన చేసేలా ఆదేశాలు జారీ చేస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ నాయకులు జె.సుదర్శన్‌గౌడ్, హరినాథ్‌రెడ్డి, కర్రొళ్ల సురేందర్, పెద్దిరెడ్డి రాజశేఖర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

మానసిక ప్రశాంతతకు యోగా అవసరం



కోర్టు ఆవరణలో యోగ చేస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు

వికారాబాద్, జూన్ 21: మానసిక ప్రశాంతతకు, ఆరోగ్యానికి యోగా ఎంతగానో ఉపయోగపడుతుందని వికారాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సున్నం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కోర్టు ఆవరణలో శుక్రవారం జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని కోర్టు ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయమూర్తి చంద్రకిషోర్, సీనియర్ సివిల్ జడ్జీ న్యాయమూర్తి డీబీ.శీతల్, ప్రిన్సిపాల్ జూనియర్ న్యాయమూర్తి శ్రీకాంత్, అదనపు జూనియర్ న్యాయమూర్తి శృతిదూత, బార్ ప్రెసిడెంట్ అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, న్యాయవాదులు పాల్గొన్నారు.

నర్సింహారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో యోగాడే

మేడ్చల్ టౌన్, జూన్ 21: యోగా డే సందర్బంగా శుక్రవారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడ నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో యోగా గురువు కే.శ్రీనివాసరావు ద్వారా ప్రత్యేక యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాలకు చెందిన విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని యోగ ఆసనాలు వేశారు. అనంతరం యోగా గురువు శ్రీనివాస రావును కళాశాల నిర్వాహకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ నర్సింహారెడ్డి, కార్యదర్శి త్రిశూల్ రెడ్డి, కోశాధికారి త్రిలోక్‌రెడ్డి, ప్రిన్సిపల్ ఆర్.లోకనాథం, ఎస్ఏసీ కన్వీనర్ శైలజారెడ్డి, అధ్యాపకులు విద్యార్థులు హాజరయ్యారు.

ఇంజినీరింగ్ విభాగంలో కొత్త పరిశోధనలు చేయాలి

మేడ్చల్ టౌన్, జూన్ 21 : ఇంజినీరింగ్ విభాగంలో కొత్త పరిశోధనలు చేయాలని మల్లారెడ్డి విద్యాసంస్థల వ్యవస్థాపకుడు, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మ గూడ మల్లారెడ్డి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో శుక్రవారం సాఫ్ట్ కంప్యూటింగ్, సిగ్నల్ ప్రాసెసింగ్, ఇంటలిజెన్స్ మ్యానుఫాక్చరింగ్, ఎనర్జీ సస్టైనబిలిటీపై రెండు రోజులపాటు చేపడుతున్న ప్రత్యేక ఈవెంట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మల్లారెడ్డి మాట్లాడుతూ.. ఇంజినీరింగ్ విభాగంలో పరిశోధనల పాత్ర కీలకమన్నారు. ఇంజినీరింగ్ విభాగంలో బోధించే అధ్యాపకుల పరిజ్ఞానం పెంపొందించడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సేయింట్ లిమిటేడ్ వ్యవస్థాపక చైర్మన్, బోర్డు సభ్యుడు డాక్టర్ బీవీఆర్ మోహన్‌రెడ్డి, కేఐటీ భువనేశ్వర్‌కు చెందిన ప్రొఫెసర్ సురేష్, మురత్ ఎరోగుల్, శాలిని రెడ్డి, డాక్టర్ వీఎస్‌కే రెడ్డి, డాక్టర్ శ్రీనివాస్‌రావు, ప్రిన్సిపల్ పాల్గొన్నారు.



విద్యార్థులు నిర్వహిస్తున్న నృత్య ప్రదర్శన

ముగిసిన రేణుకా ఎల్లమ్మ జాతర



తాండూరు రూరల్, జూన్ 21: తెలంగాణ-కర్ణాటక సరిహద్దులోని తాండూరు మండలం కొత్లాపూర్ గ్రామ శివారులో రేణుకా ఎల్లమ్మ జాతర ఉత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. గతనెల మే 23న జాతర ఉత్సవాలు ప్రారంభం కాగా నాలుగు మంగళవారాలు, ఐదు శుక్రవారాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈనెల 7న నిర్వహించి, రథోత్సవంతోపాటు సిడే కార్యక్రమాలను భక్తులను ఆకట్టుకుంది.శుక్రవారం ఆఖరు రోజు జాతర కావడంతో భక్తులు పెద్దఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు బోనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి ఆ తర్వాత నైవేద్యం సమర్పించారు. ఉత్సవాల్లోఆలయ ఈవో శేఖర్‌గౌడ్‌తోపాటు మాజీ ఆలయం కమిటీ చైర్మన్ సందీప్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, సాయిలు, గోపాల్, సిబ్బంది రవి పాల్గొన్నారు.



బోనాలతో వస్తున్న మహిళలు



చిలుకూరు బాలాజీని దర్శించుకున్న ట్రైనీ ఐఏఎస్‌లు

మొయినాబాద్ మండలంలో ట్రైయినీ ఐఏఎస్‌ల సందర్శన

మొయినాబాద్ రూరల్, జూన్21: నగర శివారులోని మొయినాబాద్ మండలాన్ని ముగ్గురు ట్రెయినీ ఐఏఎస్‌లు సందర్శించారు. ఈ సందర్బంగా మండలంలోని అజీజ్‌నగర్, చిలుకూరు గ్రామ పంచాయతీలను పరిశీలించారు. జీపీ కార్యాలయంలోని రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం గ్రామాల పరిధిలోని డంపింగ్ యార్డులు, నర్సరీల్లో మొక్కలను పరిశీలించారు. గ్రామంలో తడి, పొడి చెత్త సేకరణ, పారిశుధ్య పనులపై ఆరా తీశారు. పరిపాలనపై అధికారులు మండల స్థాయి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చిలుకూరు బాలాజీ ఆలయంలో వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ట్రెయినీ ఐఏఎస్ అధికారులు జస్లీన్ కౌర్, అర్పిత్ గుప్తా, యాక్స్ చౌదరిలు పాల్గొన్నారు. వారితో జడ్పీ సీఈవో శ్రీ కృష్ణారెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌మోహన్, డీఎల్పీవో సతీష్, ఎంపీడీవో సంధ్యారాణి, ఎంపీవో వెంకటేశ్వర్‌రెడ్డి పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

మూడు రోజులుగా రిజిస్ట్రేషన్లు బంద్

షాద్‌నగర్ రూరల్, జూన్21: షాద్‌నగర్ తహసీల్దార్ కార్యాలయంలో మూడు రోజులుగా భూముల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. తహసీల్దార్ పార్థసారథి మూడు రోజుల నుంచి సెలవుపై వెళ్లడంతో భూముల రిజిస్ట్రేషన్ల కోసం స్లాట్స్ బుక్ చేసుకున్న వారు పడిగాపులు కాస్తున్నారు. కలెక్టర్ కూడా అందుబాటులో లేకపోవడంతో తంబ్ ఇంప్రెషన్ మరొకరికి ఇవ్వలేదు. దూరప్రాంతాల నుంచి వచ్చిన కొనుగోలు, విక్రయదారులు అవస్థలు పడుతున్నారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని రిజిస్ట్రేషన్లు జరిగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

అంగన్‌వాడీ టీచర్ల సేవలు ప్రశంసనీయం

యాచారం, జూన్ 21: అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు చిన్నపిల్లలను చేరదీసి విద్యాబోధన చేసి తీర్చిదిద్దడం అభినందనీయమని యాచారం ఎంపీపీ కొప్పు సుకన్యబాషా అన్నారు. శుక్రవారం యాచారంలోని రైతు వేదికలో అంగన్‌వాడీ టీచర్లకు ప్రీప్రైమరీ స్కూల్‌పై నిర్వహించిన శిక్షణ శిబిరం ప్రారంభించారు. తమ సేవలను ప్రతీ కుటుంబానికి అందేటట్లు చర్యలు తీసుంటున్నామని సీడీపీవో శాంతిశ్రీ చెప్పారు. కార్యక్రమంలో జడ్పీటీసీ జంగమ్మ తదితరులున్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


షాద్‌నగర్ అర్బన్ : యోగా దినోత్సవంలో పాల్గొని మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్


ఇబ్రహీంపట్నం : టీఆర్ఆర్ స్కూల్లో ఆసనాలు వేస్తున్న విద్యార్థులు



మహేశ్వరం : మాట్లాడుతున్న వీరేందర్‌గౌడ్


చేవెళ్ల : యోగా సాధనలో స్థానికులు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యమని పలువురు గురువులు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఔత్సాహికులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం పట్టణాలు, పల్లెలు, పాఠశాలల్లో జోరుగా యోగాసనాలు వేశారు.


ఆమనగల్లు : యోగా సాధనలో మహిళలు యువతులు


కొత్తూర్ : ఉన్నత పాఠశాలలో యోగాసనాలు..


షాబాద్ : పోతుగల్ పాఠశాలలో యోగాసనాలు..


యాచారం మండలం చింతపట్ల ఉన్నత పాఠశాలలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు


షాద్‌నగర్‌రూరల్ : రాయికల్ పాఠశాలలో విద్యార్థులు యోగాసనాలు


చౌదరిగూడ : పెద్ద ఎల్కిచర్ల పాఠశాలలో..



కడ్తాల్ : బటర్‌ఫ్లై స్కూల్‌లో యోగా విన్యాసంలో విద్యార్థినులు


కందుకూరు: జైత్వారం పాఠశాలలో..


కేశంపేటలో నాయకులు, యువకుల ఆసనాలు

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో భార్య మృతి, భర్తకు గాయాలు

కొత్తూర్, జూన్ 21: మండల కేంద్రానికి సమీపంలో వైజంక్షన్ వద్ద 44వ జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్య మృతి చెందగా, భర్తకు గాయాలైనాయి. సిద్దాపూర్ గ్రామానికి చెందిన వస్పరి పర్వతాలు, భార్య పద్మమ్మ(40) బైక్‌పై తిమ్మాపూర్ వైపు వెళ్తుండగా.. వెనుక నుంచి టిప్పర్ ఢీకొంది. పద్మమ్మకు తీవ్ర గాయాలు కాగా ఆసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందినట్లు ఎస్సై కె.శ్రీనివాస్ తెలిపారు. పర్వతాలు స్వల్పగాయాలతో బయటపడ్డాడని పేర్కొన్నారు. మృతదేహాన్ని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

ఉరేసుకొని వలస కూలీ ఆత్మహత్య

కందుకూరు, జూన్ 21 : పొట్ట కూటి కోసం ఒడిషా నుంచి వలస వచ్చిన ఓ కూలీ ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని అగర్‌మియాగూడలో చోటుచేసుకుంది. బాధితులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. మండలంలోని అగర్‌మియాగూడలో తుమ్మల శ్రీనివాస్‌రావుకు 20ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అందులో పనిచేయడానికి నాలుగేళ్ల క్రితం ఒడిషాకు చెందిన బోజో పాండ(27) కూలీగా పనికి కుదిరాడు. అతడు మద్యం అతిగా సేవించేవాడు. ప్రతీనెల శ్రీనివాస్‌రావు రూ.11వేల వేతనం ఇచ్చేవాడు. ఇటీవల స్వగ్రామానికి వెళ్లి తిరిగి వచ్చిన పాండ గురువారం రాత్రి భోజనం చేసి శ్రీనివాస్‌రావు వ్యవసాయ క్షేత్రంలోని ఇంట్లో నిద్రించడానికి వెళ్లాడు. శుక్రవారం ఉదయం పనిలో చేరకపోవడంతో సూపర్‌వైజర్ అప్పిరెడ్డిపల్లి మల్లేష్ పాండ ఇంటికి వెళ్లి చూడగా ఇంట్లో ఉరుసుకొని కనిపించాడు. మల్లేష్ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఎస్సై శ్రవణ్‌కుమార్ మృతదేహాన్ని ఉస్మానియాకు తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మాట వినలేదని వ్యక్తిపై దాడి

షాద్‌నగర్ రూరల్, జూన్ 21: చెప్పిన మాట వినలేదని తన హోటల్ పక్కన ఉన్న మరో హోటల్‌లో పనిచేసే వ్యక్తిపై కత్తితో దాడిచేసిన ఘటన ఫరూఖ్‌నగర్‌లోని పాత అశియాన హోటల్ వద్ద గురువారం రాత్రి జరిగింది. ఇన్‌స్పెక్టర్ ప్రతాప్‌లింగం కథనం ప్రకారం.. పాత అశియాన హోటల్ యజమాని సాబేర్ రాత్రి హోటల్ మూసే సమయంలో బయట ఉన్న సామాన్లు లోపల పెట్టాలని పక్క హోటల్లో పనిచేసే అహ్మద్‌కు చెప్పాడు. అందుకు అతడు నిరాకరించి వెళ్లిపోతుండగా కూరగాయలు కోసే కత్తితో దాడిచేయగా.. మెడకు తీవ్రగాయమైంది. పోలీసులు గాయపడిన వ్యక్తిని నగరంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బావిలో దూకి మహిళ ఆత్మహత్య

చేవెళ్ల, జూన్ 21 : మానసికస్థితి సరిగా లేని ఓ మహిళ వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని చనువల్లిలో చోటుచేసుకుంది. చనువల్లికి చెందిన ఉషగారి జంగమ్మ (78) కూతురు కొంతకాలం క్రితం చనిపోయింది. అప్పటి నుంచి జంగమ్మ మానసికంగా బాధపడుతూ ఉండేది. ఈనెల 20న ఇంటి నుంచి బయటకు వెళ్లింది. గ్రామంలోని ఓ వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. శవాన్ని గమనించిన గ్రామస్తులు పోలీస్‌లకు సమాచారం అందించారు. మృతదేహాన్ని బయటకు తీశారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

మాల్‌లో మేకల అపహరణ

యాచారం, జూన్ 21 : యాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని మాల్‌లో 7 మేకలు, ఒక మేకపోతును గుర్తుతెలియని దుండగులు గురువారం అర్ధరాత్రి అపహరించారు. మాల్‌కు చెందిన నిమ్మరాజు పుల్లయ్య తన మంద వద్ద నిద్రిస్తుండగా అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు అతన్ని బెదిరించి మందలో ఉన్న 7 మేకలు, ఒక మేకపోతును ఎత్తుకెళ్లారు. సమాచారమందుకున్న పోలీసులు సాగర్-హైదరాబాద్ ప్రధాన రహదారిపై తనిఖీలు చేసినా దుండగులు తప్పించుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

కారు బోల్తా.. దంపతులకు గాయాలు

యాచారం, జూన్ 21 : కారు అదుపు తప్పి బోల్తాపడిన ఘటనలో దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. యాచారం పోలీస్‌స్టేషన్ పరిధి బాలాగ్రామ్ సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున ఈ సంఘటన జరిగింది. ప్రకాశం జిల్లా కంభంనకు చెందిన ఎస్కే. సయ్యద్(48) తన భార్య బీబీతో కలిసి నగరం నుంచి స్వగ్రామానికి కారులో వెలుతున్నారు. బాలాగ్రామ్ సమీపంలో కారు అదుపుతప్పి గోడకు బలంగా ఢీకొట్టింది. దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. పెట్రో మొబైల్-2 పోలీసులు సంఘటనా ప్రదేశానికి చేరుకొని క్షతగాత్రులను నగరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఇరువురు కోలుకుంటున్నారని పోలీసులు చెప్పారు.

వ్యవసాయ బోర్ల కేబుల్ వైర్ల చోరీ

ఆమనగల్లు, జూన్ 21 : మండల పరిధిలోని మేడిగడ్డ తండా, ఆమనగల్లుకు చెందిన 33 మంది రైతుల వ్యవసాయ బోర్ల కేబుల్ వైరులు చోరీకి గురయ్యాయి. ఆమనగల్లు హెచ్‌పీ పెట్రోల్ బంక్ వెనక భాగంలో ఉన్న పొలాల్లో 33మంది రైతులకు చెందిన 40వ్యవసాయ బోర్ల కేబుల్‌ను గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించారు. తమ బోర్ల కేబుల్ వైరు చోరీకి గురైందని ఆమనగల్లు, మేడిగడ్డకు చెందిన రైతులు రవీందర్, జితేందర్, చింద్ల, బద్యా, తాక్యా, మల్లేష్, దీపక్, శ్రీను, సాయిలు, బాలయ్య, ఇస్తారీ, తోట మల్లేష్, బాల్య, హేమ్లు, రవి, తలిసిరాం తదితర రైతులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఎంపీడీవోకు సన్మానం



ఆమనగల్లు, జూన్ 21: ఆమనగల్లు ఎంపీడీవోగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన కుసుమ మాధురిని శుక్రవారం ఎంపీపీ అనితవిజయ్, వైస్ ఎంపీపీ జక్కుఅనంత రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు దోనాదుల కుమార్, నిట్ట మంగమ్మ, సరిత పంతూనాయక్‌లు మర్యాద పూర్వకంగా కలిశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ను కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించి అబినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో శ్రీలత, ఏఈ కృష్ణయ్య, మండల పరిషత్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

సత్వరమే సమస్యల పరిష్కారం : ఎంపీపీ


మాట్లాడుతున్న ఎంపీపీ అనితవిజయ్

ఆమనగల్లు, జూన్ 21: ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని బాధ్యతగా భావించి నిరంతరం వారికి అందుబాటులో ఉంటూ మండల అభివృద్ధికి కృషి చేశామని ఎంపీపీ అనితవిజయ్ అన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ముందుకు సాగితే సమస్యలు సత్వరంగా పరిష్కారం కావడంతో పాటు ప్రభుత్వ పథకాల నిర్ధేశిత లక్ష్యాలను చేధించవచ్చన్నారు. ఆమనగల్లు మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. వైస్ ఎంపీపీ అనంతరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు హాజరయ్యారు. వర్గం చివరి సమావేశం నేపథ్యంలో సాదాసీదాగా సభ కొనసాగింది. ఒక దశలో ఎంపీపీ భావోద్వేగానికిలోనై కంటతడి పెట్టింది. ఐదేళ్లు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించామని, మిగులు పనుల పూర్తికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ద్వారా కృషిచేస్తామని తెలిపారు. అసంపూర్తిగా నిలిచిపోయిన , శంకుస్థాపన చేసి ప్రారంభించని రోడ్లు, భవనాల , వంతెనల ను వీలైనంత త్వరగా పూర్తి చేసేలా చూస్తామని పేర్కొన్నారు. జంగారెడ్డిపల్లి నుంచి చంద్రాయన్‌పల్లి బీటీ రోడ్డు పూర్తిగా పాడై ఇబ్బందులు కలుగుతున్నాయని ఎంపీటీసీ కుమార్ సభ దృష్టికి తెచ్చారు. నిధులు మంజూరు అయ్యాయని టెండర్లకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని ఏఈ రవితేజ సమాధానం ఇచ్చారు. పెండింగ్ పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని ఎంపీపీ, వైస్ ఎంపీపీ తెలిపారు.

జయశంకర్ సార్ సేవలు చిరస్మరణీయం

- చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య
- ప్రొఫెసర్ వర్ధంతి సందర్భంగా నివాళి

చేవెళ్ల, జూన్ 21 : తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సేవలు చిరస్మరణీయమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య కొనియాడారు. జయశంకర్ సార్ వర్ధంతిని పురస్కరించుకుని మండల కేంద్రంలోని ఆయన విగ్రహానికి పూల మాల సమర్పించి నివాళులర్పించారు. జయశంకర్ తెలంగాణ కోసం చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఎంపీపీ విజయలక్ష్మీరమణారెడ్డి, వైస్ ఎంపీపీ శివప్రసాద్, మాజీ సర్పంచ్ శైలజ ఆగిరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ యాదయ్య, పీఏసీఎస్ చైర్మన్ సమత వెంకట్‌రెడ్డి, డీసీసీ మాజీ చైర్మన్ వెంకటస్వామి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి అనంతరెడ్డి, సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు రామస్వామి, ప్రభులింగం, సత్తిరెడ్డి, సత్యనారాయణచారి, సుధాకర్


చేవెళ్ల : జయశంకర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య తదితరులు

గౌడ్, యువ నాయకుడు వైభవ్‌రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ శ్రీనివాసచారి, తదితరులున్నారు.

షాద్‌నగర్ అర్బన్ : ప్రొఫెసర్ జయశంకర్ ఆశయ సాధనకు బీఆర్ఎస్ కార్యకర్తలు కృషి చేయాలని ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్‌రెడ్డి పిలుపునిచ్చారు. షాద్‌నగర్ న్యూసిటీ కాలనీలోని జయశంకర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌తో కలిసి పూలమాలలువేసి నివాళులర్పించారు. అంజయ్య యాదవ్ మాట్లాడుతూ జయశంకర్ సార్‌తో కలిసి తెలంగాణ కోసం ఉద్యమించే భాగ్యం తమకు కల్గిందని.. ఆయనతో ఉన్న జ్ఞాపకాలను గుర్తుచేశారు. జడ్పీ వైస్ చైర్మన్ గణేష్, మున్సిపల్ చైర్మన్ నరేందర్, వైస్ చైర్మన్ నటరాజ్, బీఆర్ఎస్ నాయకులు రాజావరప్రసాద్, కడెంపల్లి శ్రీనివాస్, పి.లక్ష్మీనర్సింహ్మారెడ్డి, రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లు : తెలంగాణ సాధన కోసం చివరి శ్వాస వరకు పోరాడిన జయశంకర్ చిరస్మరణీయుడని ఎంపీపీ అనితవిజయ్, వైస్ ఎంపీపీ అనంతరెడ్డిలు అన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీడీవో కుసుమ మాధురి, ఎంపీటీసీలు సరిత పంతూనాయక్, మంగమ్మ నారాయణ, దోనాదుల కుమార్‌లతో కలిసి జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యుత్ శాఖ ఏడీఈ శ్రీనివాస్, పశువైద్య అధికారి విజయ్‌కుమార్, మాజీ వైస్ ఎంపీపీ నారాయణ, పీఆర్ ఏఈ కృష్ణయ్య, నాయకులు పంతూనాయక్, విజయ్‌రాథోడ్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

కొందుర్గు : జయశంకర్ సార్ వర్ధంతిని బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని జీఎం మినీఫంక్షన్ హాల్‌లో సార్ చిత్ర పటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, రామకృష్ణ, దర్గా రాంచంద్రయ్య, రెడ్డి నర్సింలు, అబ్దుల్ కలాం, పి.శ్రీనివాస్, శ్రీను, కృష్ణ, పెరుమాల్‌రెడ్డి ఉన్నారు.


ఆమనగల్లు : నివాళులర్పిస్తున్న ఎంపీపీ, వైస్ ఎంపీపీ తదితరులు


షాద్‌నగర్‌అర్బన్ : నివాళులు అర్పిస్తున్న బీఆర్ఎస్ నేతలు

నీట్ అవకతవకలపై విచారణ జరిపించాలి

ఆమనగల్లు, జూన్ 21: నీట్ పరీక్షలో అవకతవకలపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు తెల్లమల్ల జగన్, పట్టణాధ్యక్షుడు మానయ్య, జిల్లా నాయకుడు మండ్లీరాములులు డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తుందని, నీట్ పరీక్షల్లో అవకతవకలకు ప్రభుత్వ ఉదాసీన వైఖరే కారణమని వారు ఆరోపించారు. ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం నీట్ పరీక్షను రద్దు చేసి తిరిగి నిర్వహించి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాజీవ్ చౌక్ వద్ద బైటాయించి ధర్నా, రాస్తారోకో చేశారు. మోదీ, బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నాయకులు తదితరులున్నారు.

షాద్‌నగర్ : నీట్ లీకేజీపై వెంటనే సీబీఐ విచారణ జరిపించాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


కడ్తాల : ధర్నాలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

డిమాండ్ చేశారు. షాద్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని విచారం వ్యక్తం చేశారు. అంగట్లో సరుకు మాదిరిగా ప్రశ్న పత్రాలు అమ్ముకుని విద్యార్థుల జీవితాలను అగాధంలోకి నెట్టారని ఆందోళన వ్యక్తం చేశారు. నాయకులు యాదయ్య, చెన్నయ్య తదితరులు ఉన్నారు.

కడ్తాల్ : నీట్ -2024 పేపర్ లీకేజీకి మోదీ బాధ్యత వహించి తన పదవికి రాజీనామా చేయాలని డీసీసీ అధికారప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యనాయక్ ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలున్నారు.

చేవెళ్ల : నీట్ పేపర్ లీకేజీ దోషులను ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్షకార్యదర్శులు శ్రీనివాస్, అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. నాయకులు గౌలికర్ సాయి, గణేశ్, సమీర్, హరీష్, ప్రశాంత్, తదితరులు ఉన్నారు.

సంక్షిప్తంగా..

కడ్తాల్/తలకొండపల్లి : కడ్తాల పోలీస్‌స్టేషన్‌ను శంషాబాద్ డీసీపీ రాజేష్ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి కేసుల వివరాల గుర్చి అడిగి తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా మసులుకోవాలని సూచించారు. కాగా, కడ్తాల వెళ్లే రోడ్డులో సాలార్ గేటు సమీపంలోని ఈనెల 19న రాత్రి ఆరుగురు దుండగులు దారి దోపిడీకి పాల్పడిన ఘటన స్థలాన్ని అడిషనల్ డీసీపీ రామ్‌కుమార్, సీఐలు ప్రమోద్‌కుమార్, శివప్రసాద్‌లతో కలిసి డీసీపీ రాజేశ్ పరిశీలించారు.

తలకొండపల్లి : కల్వకుర్తి నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన నిరుపేద విద్యార్థులు చరణ్, చింటు, శ్రీవాణి, శృతి, హర్షిత, పల్లవిలు ఉన్నత విద్యకు ఇబ్బంది పడుతూ జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్‌ను ఆశ్రయించారు. ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో అడ్మిషన్ చేయించారు.

షాబాద్ : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆర్యవైశ్య కార్పోరేషన్ చైర్మన్ కల్వ సుజాత అన్నారు. మండల పరిధిలోని చందన్‌వెళ్లి గ్రామానికి చెందిన బొంతపల్లి విద్యాసాగర్‌గుప్తా తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం చందన్‌వెళ్లి, హైతాబాద్, రుద్రారం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 500 మంది విద్యార్థులందరికి నోటుబుక్స్, పెన్నులు, పెన్సిల్‌లను అందజేశారు. ఎంపీపీ ప్రశాంతిమహేందర్‌రెడ్డి, మాజీ సర్పంచులు ప్రభాకర్‌రెడ్డి, మల్లేష్, వీరయ్యగుప్తా, వీరేష్‌గుప్తా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. వెంకమ్మగూడ పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఎంపీపీ, ఎంఈవో శంకర్‌రాథోడ్, ప్రధానోపాధ్యాయుడు సింహాద్రినాయుడు తదితరులున్నారు.

కడ్తాల్ : పనితీరు పైనే ప్రభుత్వ ఉద్యోగులకు ప్రజల్లో గుర్తింపు లభిస్తుందని రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. కడ్తాల ఎంపీవోగా రెండేళ్లుగా విధులు నిర్వహించి మంచాల మండలానికి బదిలీ అయిన మధుసూధనాచారిని పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. లాయక్‌అలీ, గురిగళ్ల రామచంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

తలకొండపల్లి : మధ్యాహ్న భోజన కార్మికుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం ఈనెల 24న కలెక్టరేట్ ఎదుట ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సీఐటీయు ఆమనగల్లు ఏరియా కమిటీ కన్వీనర్ జి.పెంటయ్య తెలిపారు. శుక్రవారం కార్మికుల సమావేశం నిర్వహించారు.

మహేశ్వరం : గ్రామాల అభివృద్ధి, ప్రజాసంక్షేమం, విద్య, వైద్యానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని మహేశ్వరం ఎంపీపీ సునితఅంద్యానాయక్ అన్నారు. కేసీతాండాలో రూ.4.5లక్షలతో అంగన్‌వాడీ, డ్వాక్రా భవనాలకు ప్రహరీ, టాయ్‌లెట్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు.

కొత్తూర్ : రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని షాద్‌నగర్ వ్యవసాయ శాఖ ఏడీఏ రాజారత్నం హెచ్చరించారు. మున్సిపాలిటీలోని తిమ్మాపూర్ వద్ద గల ధరణి సీడ్స్ ఫర్టిలైజర్స్ దుకాణాన్ని తనిఖీ చేశారు.

శంకర్‌పల్లి : బయన్నగూడలో చెత్త డంపింగ్ యార్డు పనులు నిలిపి వేయాలని గ్రామస్తులు డిమాండు చేశారు. పనులు నిలిపి వేయాలని కోరుతూ జిల్లా పంచాయతీ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు.

షాద్‌నగర్‌అర్బన్ : ఏరువాక పౌర్ణమిని పురష్కరించుకుని టీడీపీ పొలిట్‌బ్యూర్ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు గోమాతకు పూజ చేశారు. షాద్‌నగర్ వెంకటేశ్వరస్వామి ఆలయంలోని ఒంగోలు జాతికి చెందిన గోమాతను కడిగి, ఆలయ పూజారి శ్రీనివాసాచార్యులచే పూజ చేయించారు. భక్తిశ్రద్ధలతో గోమాతకు పూజ చేస్తే ముక్కోటి దేవతలకు పూజ చేసినట్టేనని బక్కని నర్సింహులు అన్నారు. తుమ్మల ప్రసాద్, వెంకటసాయిశ్వర్‌రెడ్డి, రాంభూపాల్, జి. భాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం : కార్గిల్ యుద్ధ సమయంలో దేశ రక్షణ కోసం ప్రాణాలర్పించిన మేజర్ పద్మపాణి ఆచార్య 55వ జయంతిని పురష్కరించుకొని ఇబ్రహీంపట్నంలోని గురునానక్ విద్యాసంస్థల్లో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. రెడ్ క్రాస్ సొసైటీ సౌజన్యంతో నిర్వహించిన ఈ శిబిరాన్ని తెలంగాణ రాష్ట్ర రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ రిటైర్డ్ ఐపీఎస్ అజయ్ మిశ్రా ప్రారంభించారు. 600 మంది విద్యార్థులు ముందుకు వచ్చి రక్తదానం చేశారు.

కొత్తూర్ : అంతర్గత రోడ్ల నిర్మాణంతో గ్రామాలు అభివృద్ధి చెందుతాయని స్థానిక ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి అన్నారు. మల్లాపూర్‌లో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు.

కొత్తూర్ : మానవ అక్రమ రవాణా నిర్మూలించడం ప్రతీ ఒక్కరి బాధ్యతని ప్రజ్వల సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ బలరామకృష్ణ, వెలుగు సంస్థ కోఆర్డినేటర్ మహమ్మద్ ఖలీల్‌లు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శుక్రవారం ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ హైదరాబాద్, గ్రామీణ పేదరిక నిర్మూల సంస్థ ఆధ్వర్యంలో మానవుల అక్రమ రవాణాపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

ఆమనగల్లు : రాష్ట్రంలో విద్యా శాఖ మంత్రిని నియమించి విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీజేవైఎం ఆధ్వర్యంలో శుక్రవారం ఆమనగల్లు పట్టణంలో వినూత్న నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు కండె సాయి, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కో-కన్వీనర్ రవిరాథోడ్, కల్వకుర్తి నియోకవర్గ బీజేవైఎం కన్వీనర్ అనిల్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేసి వినూత్న రీతిలో నిరసన తెలిపారు.

యాచారం : గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను దశలవారీగా పరిష్కరించి ఆదుకుంటామని యాచారం ఎంపీడీవో నరేందర్‌రెడ్డి తెలిపారు. జీపీ కార్యాలయ ఆవరణలో గ్రామసభ నిర్వహించి సమస్యలు తెలుసుకున్నారు. యాచారం : మధ్యాహ్న భోజన కార్మికులకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతూ శుక్రవారం సీఐటీయూ మండల కన్వీనర్ చందూనాయక్ ఎంఆర్‌పీ రాధాకృష్ణకు సమర్పించిన వినతిపత్రంలో కోరారు. గౌరవ వేతనం, విద్యార్థుల మెస్‌చార్జీలు పెంచాలని కోరారు.

శంకర్‌పల్లి : శ్మశానవాటిక స్థలాన్ని కొనుగోలు చేసిన వ్యక్తిపై అధికారులు చర్యలు తీసుకోవాలని కొజ్జగూడ గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఎల్వర్తి అనుబంధ గ్రామమైన కొజ్జగూడ లో శ్మశాన వాటిక వద్ద గ్రామస్తులు నిరసన తెలిపారు. వేణుగోపాల్ దొర తమకు కేటాయించిన స్థలంలో బొందలు పెట్టుకునే హక్కు లేదా అంటూ? ప్రశ్నించారు. ఇప్పటి వరకు రెవిన్యూ రికార్డులలో బొందలగడ్డ(స్మశానవాటిక)గా ఉందన్నారు. గ్రామానికి చెందిన జొన్నాడ నర్సింలు ఇటీవల ఆ భూమిని కొనుగోలు చేశాడని గ్రామస్తులు తెలిపారు. అయితే, జొన్నాడ నర్సింలుకు భూమి రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చిన తరుణ్‌కుమార్ అనే వ్యక్తి ఎవరో తమకు తెలియదని వారు అన్నారు.

మహిళల సంక్షేమానికి బీఆర్ఎస్ పెద్దపీట


చెక్కులు పంపిణీ చేస్తున్న సబితారెడ్డి

కందుకూరు,జూన్ 21 : మహిళల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్ద పీట వేసిందని మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. మండంలోని పలు గ్రామాల లబ్ధిదారులు 102మందికి మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను తహసీల్దార్ కె.గోపాల్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమయ్యిందన్నారు. ఎంపీపీ జ్యోతి, జడ్పీటీసీ జంగారెడ్డి, వైస్ ఎంపీపీ శమంత ప్రభాకర్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ చంద్రశేఖర్, వైస్‌చైర్మన్ విజయేందర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి

మహేశ్వరం : మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్‌పేట్, బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్లతో పాటు జల్‌పల్లి, తుక్కుగూడ మున్సిపాలిటీల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా రిజర్వాయర్లను పూర్తి చేయాలని హెచ్ఎండబ్ల్యూఎస్ అధికారులను ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి ఆదేశించారు. శుక్రవారం జిల్లెలగూడలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. బీఆర్ఎస్ హయాంలో రూ.107కోట్ల నిధులతో 23 రిజర్వాయర్లను ఏర్పాటు చేశామని ఎన్నికల కోడ్ సందర్భంగా 13 రిజర్వాయర్ల ప్రారంభం ఆగిపోయిందని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. హెచ్ఎండబ్ల్యూఎస్ అధికారులు శ్రీనివాస్‌రెడ్డి, గోవింద్‌గౌడ్, హరీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై కఠినంగా వ్యవహరించాలి

ఆదిభట్ల, జూన్ 21 : అక్రమ నిర్మాణాలపై కఠినంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఆదిభట్ల మున్సిపాలిటీ సాధారణ బడ్జెట్ సమావేశం మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం జరిగింది. 2024- 25 సాధారణ వార్షిక బడ్జెట్ సమావేశంలో భోజన విరామం తరువాత ఎమ్మెల్యే పాల్గొన్నారు. బడ్జెట్ సమావేశానికి రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, భువనగిరి ఎంపీ కిరణ్ కుమార్‌రెడ్డిలు పాల్గొంటారని ప్రచారం జరిగినా ఎమ్మెల్యే మల్‌రెడ్డి మాత్రమే పాల్గొన్నారు. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు మున్సిపాలిటి పరిధిలో మిషన్ భగీరథ, ఎలక్ట్రిసిటీ, ఇరిగేషన్ లాంటి పలు అంశాలపై ఎమ్మెల్యే అధికారులతో రివ్యూ నిర్వహించారు.. 2024- 25 మున్సిపాలిటీ సాధారణ వార్షిక బడ్జెట్ 16,30కోట్లు మున్సిపల్ పరిధిలో రోడ్లు, మురికి కాలవల నిర్మాణం లాంటి వివిధ అభివృద్ధి పనులకుగాను రూ.4 కోట్లతో చేపట్టిన ప్రతి పాదనలకు కౌన్సిలు సభ్యులు ఏకగ్రీవంతో ఆమోదం తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో లేఔట్లలో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, అక్రమ నిర్మాణాల పట్ల కఠినంగా వ్యవరించాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ, వైస్ చైర్మన్ యాదగిరి, కౌన్సిలర్లు వనం శ్రీనివాస్, దాసు, మహేందర్, కో ఆప్షన్ సభ్యులు గోపాల్ గౌడ్, మున్సిపల్ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.